# ప్రాణం ఖరీదు. . . ?

కవితా శేఖర్

అందమైన పేరుతో పాటు అందాన్ని, అందమైన వ్యకిత్త్వాన్నిసొంతం చేసుకుంది "నవీన ". అంతే కాదు అందమైన కలలు కూడా కనే వయస్సు నవీనది. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే ఆ "డ్రీమ్ గర్ల్" అంటే కురాళ్ళకు క్రేజు . . . కొంతమంది తోటి ఆడపిల్లలకు అసూయ. . . డేరింగ్‌డాషింగ్‌డైనమిక్‌బ్రిలియంట్‌టాలెంటెడ్‌లాంటి మాటలు నవీన గురించి అందరూమాట్లాడుకునే "ఊతపదాలు ".

oooooooooooo

గల గలా మాట్లాడే నవీన ఆ రోజు ఆఫీసులో తన బాస్‌తో సరదాగా అందో లేక సీరియస్‌గా అందో తెలియదు కానీ పైనుంచి తథాస్తు దేవతలు మాత్రం "తథాస్తు " అని పలికేసినట్టున్నారు. . . . .

ooooooooooooooo

నవీన పర్సనల్‌డైయరీ లోని ఒక ఘట్టం లోకి తొంగిచూస్తే. . . . . . .

ooooooooooooooo

వేసవి కాలం, అందులోనూ విశాఖపట్టణం. . . ఉక్కపోత ఉప్పును తయారుచేద్దామని ఉబలాటపడుతోంది. ఫ్యాను "చప్పుడు " చెయటానికే అన్నట్టు గురక పెడుతోంది. నాకు, మా అమ్మకు నిద్ర పట్టటం లేదు. అబ్బా. . . . తుక తుక లాడి పోతోంది అని విసుక్కుంటూ ఇద్దరం వరండాలో రెండు మంచాలు వాలదీసి నడుం వాల్చాం. మా నాన్నగారు క్యాంపుకని హైదరాబాదు వెళ్ళారు. హాయిగా చల్లగాలి వీస్తుంటే, వెన్నెల కాస్తుంటే నేను చందమామ అందాన్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాను.

ooooooooooo

" ఖాం నన్ను చంపద్దు ఖాం. . . నీకాళ్ళు పట్టుకుంటాను. . . రేపొద్దునే తిరిగి ఇచ్చేస్తాను. . . నన్నొదిలెయ్యి. . . . ."

ఉల్లిక్కి పడి లేచి చూసాను. . . ఆ అరుపులు కలలో కాదు అని నిర్ధారించుకున్నాక మెల్లిగా పక్కమీదనుంచి లేచి బాల్కనీ లోంచి తొంగి చూసాను. స్ట్రీటులైటు కళ్ళు మూసుకుని వున్నా వెన్నెల మాత్రం కళ్ళు పెద్దవిగా చేసి చూస్తోంది. ఒక కుర్రాడు దీనంగా అరుస్తూ, ఏడుస్తూ కింద పడుతూ లేస్తూ పరిగెడుతున్నాడు. పక్కనే ఒకడు ఏసెయ్యరా ఏసేయ్అని ఇంకొకణ్ణి గదమాయిస్తున్నాడు. ఆ "ఇంకొకడు " గొడ్డలి లాంటి దానితో ఆ

అరుస్తున్న వాణ్ణి పోట్లు పొడుస్తున్నాడు. నాకు మతి పోయినంత పనయ్యింది. పక్కనే ఉన్న అమ్మను నిద్రలేపి మెల్లిగా చెవిలో చెప్పాను. అమ్మ పీడకలేదో వచ్చింది నీకు...ఆంజనేయ దండకం చదువుకుంటూ పడుకోమని చెప్పింది. అమ్మను లేపి బాల్కనీ లోకి తొంగిచూడమని చెప్పాను...అమ్మకూడా "ఆ నమ్మలేని నిజాన్ని " చూసి వొణికి పోయింది.

పద పద .....లోపలికి పద..అసలే మీ నాన్నగారు కూడా ఊళ్ళో లేరు అని లోపలికి పరుగుతీసింది అమ్మ. నేను ఒక్కసారి కిందకు చూసేసరికి ఆ "కుర్రవాడు " రక్తపు మడుగులో మా గుమ్మం మీద పడి ఉన్నాడు. ఆ హంతకులిద్దరూ మాయమైపోయారు....

oooooooooo

లోపలికి వెళ్ళినప్పుడు టైము చూసాను. 12.43 నిమిషాలయ్యింది. సినిమాలెక్కువ చూడటం వల్లనో లేక డిటెక్టివ్‌నవళ్ళు చవటం వల్లనో తెలియదు కానీ నాకు చిన్నపటినుంచీ

ధైర్యం, తెగింపు ఎక్కువే. అమ్మ పడుకుందామని ప్రయత్నిస్తోంది కానీ నాకు ఏదో ఒకటి చేయాలనిపించింది. అమ్మతో పోలిసులకి ఫోను చేద్దమంటే నాకు పిచ్చిపట్టిందా అని అడిగింది. నేను "అదేమిటమ్మా కళ్ళెదురుగుండా హత్య జరిగింది.పైగా అతను ఇంకా బ్రతికే ఉన్నాడేమో ఆ హంతకులు కూడా ఎంతో దూరం పారిపోయి ఉండరు. చదువుకున్న వాళ్ళం మనం కూడా ఇలా భయపడితే ఎలాగమ్మా? " అన్నాను. "ఓసి పెర్రిదానా నువ్వేమైనా ఝాంసీ లక్ష్మిబాయిననుకుంటున్నావా? నోరుమూసుకుని కళ్ళుమూసుకుని పడుకో " అని తిట్టింది. ఇంకొక అరగంట అలాగే వాదించేసరికి ఇక విసిగి పోయి పక్కింటి వాళ్ళకి ఫోను చేయడానికి ఒప్పుకుంది. వాళ్ళు ఫోను ఎత్తి జరిగిందంతా విని మా అమ్మతో వంత పాడారు. పైగా నవీన చిన్న పిల్ల, పెళ్ళి కావల్సిన పిల్ల, ఇంట్లో వాళ్ళ నాన్నగారు కూడా లేరు మీకివన్నీ ఎందుకు..ఒక వేళ రేపొద్దున పోలీసులు మీ ఇంటికి వస్తే ఏమీ తెలియనట్టు ఉండమని హితబోధ చేసారు.

oooooooooooooooo

పొద్దునే అయిదిందిటికల్లా మెలుకువ వచ్చింది. కుతూహలం కొద్దీ బాల్కనీ లోకి వెళ్ళి చూస్తే ఇంటి ముందంతా జనం, పోలీసులు గుమి గూడి ఉన్నారు. అమ్మ నావెనకనే వచ్చి అప్పుడే లేచావేం ఇంట్లోకి పద అన్నది. ఆ శవం మీద (అతని తల్లి కాబోలు) పడి

హృదయవిదారకంగా రోదిస్తుంటే నా మనస్సు ద్రవించిపోయింది. సినిమాల్లో చూడటమే కానీ ఇలాంటి దృశ్యం చూస్తానని ఎవరైనా ఊహిస్తారా? అమ్మని కం వింస్‌చేసి కిందకి వెళ్ళి ఒక పోలీసుని పిల్చాను. అతను దగ్గరకు రాగానే "సార్ మా నాన్నగారు ఊళ్ళో లేరు మా లేడీసుకు ఎటువంటి రిస్కూ లేదంటే మీకొక విషయం చెప్తాను అన్నాను. వెంటనే అతను భలేదానివమ్మా మీకు ఎటువంటి ఇబ్బందీ కల్పించము...నేను అంతా చూసుకుంటాను అన్నాడు. అయితే పైకి రండి అని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్ళి "సార్‌నిన్న రాత్రి ఇతనిని చంపడం మేము కళ్ళరా చూసాము...కానీ వాళ్ళెవరో మాకు తెలియదు " అన్నాను. ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు పొలీసులంతా ఇంట్లోకి వచ్చారు. ఒక అరగంటలో ఎ.సి.పి గారు వచ్చారు. నేను చూసింది చెప్పాను. ఆయన మీకెటువంటి భయమూ లేదు ఈ సంగతి ఇక్కడితో మరిచిపోండి ఒక రెండు రోజులు మీ ఇంటికి పోలీసుల కాపలా ఉంటారు అని చెప్పి వెళ్ళి పోయారు.

oooooooooooo

పనివాళ్ళు, పాలవాళ్ళు, కూరలమ్మేవాళ్ళు, చుట్టుపక్కలవాళ్ళు, చుట్టాలు...పక్కాలు.. ఇలా

అందరికీ ఈ విషయం దావనంలా పాకిపోయింది...మనుషులకి ఇలాంటివే కదా కాలక్షేపం కబుర్లు...అవసరమైన వాడు, అనవసరమైన వాడు ఇలాంటి టైములో తెగ కల్పించుకుని పరామసిస్తారు పాపం....అమ్మ వాళ్ళు వీళ్ళు ఇచ్చే సలహాలూ సందేశాలూ విని నన్ను చావ తిట్లు తిట్టింది. నా భవిష్యత్తు గురించి ఎంతో ఆందోళన పడింది. రేపు మీ నాన్నగారు వచ్చాక నిన్నిలా పెంచానని, అతిగా స్వేచ్ఛ ఇవ్వడం వల్ల నువ్విలా తయారయ్యావని...చిన్నపిల్ల దానికి బుద్ధి లేక పోతేనేం నీ జ్ఞానం ఎక్కడ అఘోరించింది అని నా మీద విరుచుకుపడతారు అంటూ ఇంకా ఇలాంటి పిండివంటలు చాలా వడ్డించింది అమ్మ! అమ్మా, నువ్వేమీ వర్రీ అవ్వకు..ఊళ్ళో వాళ్ళు అలానే భయపెడతారు...అయినా నువ్వు నేను ఎవరు చంపారో చూడలేదు...కనీసం వాళ్ళ మొహాలు కూడా మనకు కనపడలేదు. ఊరికే టైము, ఎంత మంది ఎలా చంపారో చెప్పాము అంతే...అయినా ఎ.సి.పి. గారు ఈ విషయం గురించి మర్చిపొమ్మని అభయం ఇచ్చారు కదా! అన్నాను...

oooooooooooo

ఆఫీసుకెళ్ళగానే మా బాస్‌తో ఈ విషయం చెబితే ఆయన షాక్‌తిన్నారు. ఆ మధ్య నువ్వు సార్ నాకు లైఫ్లో ఒక మర్డర్‌కేసుకి సోల్‌విట్నెస్‌అవ్వాలనుంది " అంటే ఇదేమి వింత కోరిక అనుకున్నాను..."ఏ బనిషని ధథల"న దఎయబఎవాఎ నఫథన బన ళబయియ ధలంఎ నషనిఎ యబభఎ నఫబష" అన్నారు. అవును సార్‌నేను కూడా ఎదో సరదాగా అన్నాను కానీ ...కలలో కూడా ఊహించలేదు....అన్నాను.

సరే అయ్యిందేదో అయ్యింది నవీన...అసలు నువ్వు ఈ రోజు ఆఫీసుకి రావడమేమిటి నీకు సెక్యూరిటీ అవసరం. వెంటనే ఒక పది రోజులు సెలవు పెట్టి...ఆ కలకత్తలో మీ అక్కయ్య ఉందన్నావు కదా అక్కడికి ఎవ్వరికీ చెప్పకుండా మీ ఫామిలీని తీసుకుని వెళ్ళిపో అన్నారు మా బాసు. ఎంత చెప్పినా ఆయన వినక పోయేసరికి ఇంటికి బయలదేరాను.

ooooooooooo

ఒక వారం రోజుల పాటు పోలీసులు ఇంటికి వచ్చి ప్రశ్నిస్తూనే ఉన్నారు. మాకు ఏమి వివరాలు తెలియవని ఎంత చెప్పినా అడిగిన ప్రశ్నే రకరకాలుగా అడిగి విసిగించేవారు. నాలుగు రోజులయ్యాక క్యాంపు నుంచి తిరిగి వచ్చిన నాన్నగారు నన్ను, అమ్మను రకరకాల తిట్లతో సత్కరించారు.

ooooooooooo

మొత్తనికి ఒక ఆరు నెలలు గడిచాయి. ఒక రోజు పోస్టులో ఒక కార్డు వచ్చింది. అందులో ఫలానా రోజున ఫలానా కోర్టులో నన్ను కోర్టు సమ్మంసుకు హాజరవ్వాలని ఉంది. మా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. అమ్మ, నాన్న ఇక దీని జీవితం అయిపోయింది...దీనికి పెళ్ళి కూడా కాదు...మనం కోర్టుల చుట్టూ తిరగ వల్సిందే అని బెంగపెట్టుకున్నారు. నాన్నగారు తెలిసిన లాయర్‌దగ్గరకు వెళ్ళారు. ఆయన నన్ను చీవాట్లెట్టి నన్ను ఏదైనా ఊరు పంపించమని...ఎంత త్వరలో పెళ్ళి చేసి పంపిస్తే అంత మంచిదని సలహా ఇచ్చాడు. నాన్నగారికి ఇంకా కొంతమంది ఎన్నో చెప్పి హడలు కొట్టారు. ఆ హంతకులు మీ అమ్మాయిని చూసే ఉంటారు, వాళ్ళు పగబట్టి ఎప్పుడో అప్పుడు మీ అమ్మాయి మీద దాడి చేస్తారు అని రక రకాల భయాలను సృష్టించారు. అమ్మ, నాన్న పోరు భరించలేక నేను ఉద్ఓగానికి రాజీనామా చేసి కలకత్తా వెళ్ళాను.

oooooooooooooo

హత్య చూసిన పాపానికి అసలు హంతకులకి ఏ శిక్ష పడిందో తెలియదు. అసలు హంతకుడు దొంగసాక్ష్యాధారాలు చూపించి తప్పించుకున్నాడని కొందరన్నారు..

నేను, మా అమ్మ,  నాన్న మాత్రం ఒక సంవత్సరం పాటు ఎంతో మనోవ్యధను అనుభవించాము. ఊళ్ళో వాళ్ళు,  ఇరుగు పొరుగు వారు వేసిన శిక్ష మరీ కఠినంగా అనిపించింది.

ooooooooooooooo

నాకు పెళ్ళయ్యి అయిదు సంవత్సరాలయ్యింది. కువైట్‌నుంచి అమ్మకు ఆ వారం కూడా కాల్ చేసాను. అమ్మ చెప్పిన సంగతి విని విస్తు పోయాను.

"నవీనా మొన్న సోమవారం నాడు మళ్ళీ కోర్టునుండి సమ్మంసుకు హాజరు కమ్మని లెటర్ వచ్చింది. నేను, మీ డాడీ వెళ్ళాము. అక్కడ వారు నన్ను రకరకాల ప్రశ్నలడిగారు. నేను  మా అమ్మాయి కెనడాలో ఉందని అబద్ధం చెప్పాను. ఆరు సంవత్సరాల క్రిందట జరిగిన  సంఘటన వివరాలు నాకు సరిగ్గా గుర్తులేవని చెప్పాను. ఆ చనిపోయిన అబ్బాయి ఇరవై  నాలుగేళ్ళ వాడట, ఎదో చిన్న వ్యాపారం చేసుకుంటూ ఖాం అనే వాడి దగ్గిర అయిదు వేల  రూపాయిలు అప్పుచేసి అన్న టైముకి తీర్చలేదట. అతని తల్లి వచ్చి కాళ్ళా వేళ్ళా పడి  బ్రతిమాలింది. మీరు కనక సాక్ష్యం చెబితే ఆ హంతకుడికి శిక్ష పడుతుంది, మీరొక్కరే  మాకున్న ఆఖరి ఆశ అని ఎంతో ఏడ్చింది. కానీ నేను చెప్పాను "చూడమ్మా నీ బాధ  నేనర్థం చేసుకో గలను కానీ మేము చంపినవాడిని చూడలేదు, అసలు వాడి మొహం ఎలా  ఉంటుందో కూడా మాకు తెలియదు."  నీ పుంయమా అని ఏనాడూ కోర్టు మొహం చూడని నన్ను బోనులో నిలబెట్టావు నవీనా " అని  అమ్మ అంటే నాకు నోట మాట రాలేదు.

oooooooooo

ప్రతి మనిషీ స్వార్ధ జీవి. పక్క వాడు ఏమైపోతున్నా నాకెందుకులే అని పట్టించుకోని రోజులివి.  నా అన్నో తమ్ముడికో ఇలాంటి పరిస్థితే వస్తే ఎవరు దిక్కు అని అలోచించింది ఒకప్పటి నవీన.  కానీ తను చేసినదానికి ప్రతిఫలం చిక్కిందా? అసలు హంతకుడికి శిక్ష పడిందా?

చనిపోయిన అతని తల్లి క్షోభకు శాంతి లభించిందా? పోలీసులు ఇంతటితో ఈ విషయాన్ని మరిచిపోండి అన్న మాటకు కట్టుబడి ఉన్నరా? కళ్ళారా చూసిన నిజాన్ని చెపినందుకు ఇబ్బందుల పాలైందెవ్వరు? చీకట్లో కనిపించని (మొహాన్ని) నిజాన్ని బట్టబయలు

చేసినందుకే  నవీన కుటుంబం ఎన్ని ఇక్కట్ల పాలయ్యింది. ఇక అసలు హంతకుణ్ణి గుర్తుపడితే ఈ రోజు ఈ  సంఘటన రాయడానికి నవీన ఉండేదా?

oooooooooooooooo

డేరింగ్‌డాషింగ్‌డైనమిక్‌నవీన ఇప్పుడు బ్రతికి లేదు. ఇప్పుడు ప్రాక్టికల్‌గా అలోచించే ఒక ఇల్లాలిగా మాత్రమే నవీన ఊపిరి పీలుస్తోంది. నా ఇల్లు,  నా సంసారం, నా భర్త, నా పిల్లలు......ఇదీ  నా జీవితం! కానీ ఇప్పటికీ నన్నో ఆలోచన వెంటాడుతూనే ఉంటుంది. ఆ రోజున ఖానుని పిలిచి  నేనే అతనికి అయిదు వేలు ఇచ్చి ఉంటే ఆ కుర్రాడి ప్రాణాం దక్కేదేమో? లేక కనీసం రాత్రే  పోలీసులకి ఫోను చేసి ఉంటే ఆ యువకుడి కొనప్రాణానికి ఊపిరి పోయగలిగేదానినేమో!  అతని  ప్రాణం ఖరీదుకు ఎవరు విలువ కట్టగలరు?